ప్రజాశక్తి
బుధవారం 28 జూన్ 2023
5
అనంతపురం





అక్రమాలకు కేరాఫ్ జగనన్న లేఅవుట్..!



బుక్కరాయసముద్రం గ్రామంలోని జగనన్న లేఅవుట్-6 అక్రమాలకు కేరాఫ్‌గా నిలిచిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇక్కడ కొందరు అధికార పార్టీ నేతలు నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా ఖాళీ స్థలాలను ఆక్రమించి ఇళ్లు కట్టేస్తున్నారు. ప్రజా అవసరాల కోసం రిజర్వు చేసిన స్థలాల్లో సైతం నిర్మాణాలు చేస్తున్నారు. రోడ్లను ఆక్రమించేస్తున్నారు. యథేచ్ఛగా ఈ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు వాటివైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

- వైసిపి నేతల చేతుల్లో బికెఎస్ జగన్న లేఅవుట్-6
- యథేచ్ఛగా రిజర్వు స్థలాల ఆక్రమణ
- ఒకరి స్థలంలో మరొకరు నిర్మాణాలు
- అక్రమాల్లో ఆరితేరిన అధికార పార్టీ నేతలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, హౌసింగ్ అధికారులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రంలో 1200 మందికిపైగా పేదలకు జగనన్న కాలనీల్లో అధికారులు ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. వీటికి గృహ నిర్మాణానికి సంబంధించి అనుమతులనూ లబ్ధిదారులకు ఇచ్చారు. ఇందులో పలువురు లబ్ధిదారులు నిర్మాణ పనులను చేపట్టారు. ఇక్కడే అధికార పార్టీ నాయకులు వారి అక్రమ మార్గానికి తెరలేపారు. జగన్న కాలనీల్లో ఖాళీ, రిజర్వు స్థలాలను గుర్తించి వాటిలో నిర్మాణాలు చేపడుతున్నారు. కొందరు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఇక్కడ నిర్మాణాలు చేస్తున్నారు. ఈ కాలనీల్లో ఒకరికి మంజూరైన స్థలంలో మరొకరు నిర్మాణాలు జరుగుతున్నవి అనేకం ఉన్నాయి. పట్టా పొందిన లబ్ధిదారున్ని మోసం చేసి అధికార అండదండలు ఉన్న నేతలు నిర్మాణాలు చేసుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకులు వీటి వెనుక ఉండడంతో అధికారులు కూడా మౌనంగా ఉండిపోతున్నారు.

దళిత మహిళకు ఇచ్చిన స్థలంలో అధికార పార్టీ నేత నిర్మాణం..

బుక్కరాయసముద్రం లేఅవుట్ నెంబర్-6లో ప్లాట్ నెంబర్ 278ను దళిత మహిళ ఎ.రమాదేవి పేరుతో అధికారులు పట్టా ఇచ్చారు. ఈ స్థలాన్ని అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు ఆక్రమించుకున్నాడు. వైసిపికి చెందిన ఓ నాయకుడి భార్యకు ఈ ప్లాటు పక్కన ఇల్లు కట్టుకోవడానికి అనుమతి ఉండగా దళిత మహిళకు కేటాయించిన ప్లాట్ నెంబర్ 278లో నిర్మాణం చేశాడు. ఇదేమిటని దళిత మహిళ అధికారులను అడిగితే వారు సంబంధం లేని సమాధానం ఇస్తున్నారు. ఇలా ఈ కాలనీలో పదుల సంఖ్యలో ఒకరికి ఇచ్చిన స్థలంలో మరొకరు నిర్మాణాలు చేసి పేదలకు అన్యాయం చేస్తున్నట్లు తెలుస్తోంది.

కొండ కింద ఖాళీ స్థలాల్లోనూ అధికార పార్టీ పాగా..!

కొండకింద జగనన్న స్థలంలోనూ అధికార పార్టీ నేతలు పాగా వేశారు. గ్రీన్ పార్కు రిజర్వు స్థలాలను ఆక్రమించి ఓ అధికార పార్టీ నేత బంధువు ఏకంగా ఇప్పటికే ఇల్లు కట్టేశాడు. ప్లాట్ నెంబర్ 488 పక్కన ఉన్న రిజర్వు స్థలంలో సదరు నేత ఇంటినే కట్టాడు. ఈ ఇంటికి పంచాయితీ అధికారులు కొళాయిని కూడా మంజూరు చేయడం గమనార్హం. ప్లాట్ నెంబర్ 500 దగ్గర ఉన్న రిజర్వు స్థలం ఖాళీ జాగాలోనూ పునాదిని వేశారు.

రోడ్ల ఆక్రమణ

లేఅవుట్-6లో ప్లాట్ నెంబర్ 43 వద్ద రోడ్డును ఆక్రమించి ఓ నిర్మాణం జరుగుతోంది. ఇక్కడ ఓ అధికార పార్టీ నేత అధికారులపై ఒత్తిడి తెచ్చి రోడ్డును సైతం ఆక్రమించి నిర్మాణాలు చేసేలా అనుమతులు ఇప్పించారు. సదరు నేత సర్వే నెంబర్ 433 అడ్డతిప్ప కొండ చుట్టూ కింది భాగంలో ఖాళీగా ఉన్న స్థలాలను ఆక్రమించడం, జేసిబితో కొండను తవ్వడం, లేఅవుట్‌లో లేని స్థలాలను అమ్మడం లాంటివి నిత్యం చేస్తూనే ఉన్నాడు. ఈ నేత ఇప్పటికే ఈ కాలనీలో 25 ప్లాట్ల వరకు ఆక్రమించి విక్రయించినట్లు తెలుస్తోంది.



బికెఎస్ జగన్న లేఅవుట్-6లో ఒకరికి కేటాయించిన స్థలంలో మరొకరు నిర్మించి గృహం

ఒకరి స్థలంలో మరొకరు నిర్మాణం..

జగనన్న కాలనీ లేఅవుట్-6లో అధికార పార్టీ నేతల ప్రమేయం అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒకరికి పట్టా ఇచ్చిన స్థలంలో మరొకరు వచ్చి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదేమని అడిగితే రెవెన్యూ అధికారుల నుంచి తమకు అనుమతి ఉందని దబాయిస్తున్నారు. ఇలా బుక్కరాయసముద్రం లేఅవుట్-6లో పలువురు పేద లబ్ధిదారులను మోసం చేసి ఇతరులు నిర్మాణాలు చేస్తున్నారు. అధికార పార్టీ నేతలు ఇచ్చే లంచాలకు అలవాటు పడ్డ కొందరు అధికారులు పట్టా నెంబర్లను మార్చేసి పేద లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

అధికారులు స్పందించాలి

బుక్కరాయసముద్రం జగనన్న లేఅవుట్-6లో అనేక అక్రమాలు జరుగుతున్నాయి. వీటిపై రెవెన్యూ, హౌసింగ్ అధికారులు స్పందించాలి. రిజర్వు స్థలాలను ఆక్రమిస్తున్నారు. ఒకరికి కేటాయించిన ప్లాట్లలో మరొకరు నిర్మాణాలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లను విక్రయిస్తున్నారు. ఇవన్నీ కూడా అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. ఈ అక్రమాలపై అధికారులు స్పందించకుంటే ఆ అక్రమాల్లో వారికి భాగస్వామ్యం ఉందనుకోవాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి లేఅవుట్-6లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే లబ్ధిదారుల పక్షాన సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం నిర్వహిస్తాం.

ఆర్.కుళ్లాయప్ప, సిపిఎం మండల కార్యదర్శి, బుక్కరాయసముద్రం.

మండుతున్న కూరగాయలు

- పెరిగిన ధరలతో జనం బెంబేలు
- సెంచరీ పలుకుతున్న టమోట
- అదే బాటలో మిర్చి
- ఏమి తినాలంటూ సామాన్యుడి ఆవేదన

మొన్నటి వరకు నిత్యావసర సరుకుల ధరలే అనుకుంటే ఇప్పుడు కాయగూరల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒక్క ఉల్లి, బంగాళదుంప మినహా అన్ని రకాల కూరగాయల ధరలు చుక్కల్లో ఉన్నాయి. అన్ని రకాల కాయగూరలు కిలో రూ.50 నుంచి రూ.100కుపైగా ధర ఉంటుండటంతో ఏమి కొనాలి, ఏమి తినాలా అని సామాన్యులు తలలుపట్టుకునే పరిస్థితి నెలకొంది.



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టమోట పంట జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో సాగవుతుంది. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు పెద్దఎత్తునే ఎగుమతి అవుతూ ఉండేవి. దీంతో స్థానికంగా కొంత ధర తక్కువగానే టమోటా ఉంటూ వచ్చింది. అయితే మార్చి, మే నెలల్లో వచ్చిన అకాల వర్షాలతో పెట్టిన టమోట పంట చేతికి రాలేదు. ఈ పంట మొత్తం దెబ్బతినడంతో స్థానికంగా టమోట పంట దిగుబడి లేకుండాపోయింది. సాధారణం జూన్ నుంచి అనంతపురం నగరంలోని అతిపెద్ద టమోట మార్కెట్‌కు పెద్దఎత్తున పంట రావాల్సింది. కాని ఇప్పటికీ రాలేదు. ఎక్కడా టమోట దొరక్కపోవడంతో మార్కెట్‌లో దీనికి డిమాండ్ పెరిగింది. దీంతో మొన్నటి వరకు కిలో రూ.15 వరకు టమోట ధర ఉండేది. ఇప్పుడు అమాంతంగా పెరిగి వంద రూపాయలకు చేరవైంది. హోల్‌సేల్ మార్కెట్‌లోనే కిలో టమోట ధర రూ.80 ఉంటోంది. రిటైల్‌కు వచ్చే సరికి కిలో రూ.120 వరకు ఉంటోంది. ఇదే బాటలో పచ్చి మిరపకాయలు కూడా కిలో రూ.80 వరకు హోల్‌సేల్‌లో ఉంది. రిటైల్‌లో ఇది కూడా వంద రూపాయలకుపైగా కిలో ఉంది. ఇక బెండ, వంకాయ, క్యారెట్ వంటివి కూడా కిలో రూ.60 వరకు ధర ఉంది. ఇంత పెద్దఎత్తున ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో ఏమి కోనాలి... ఏమి తినాలో అంటూ సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు.

ఏమి కొని తినగలం

కాయగూరల ధరలు అన్ని కిలో వంద రూపాయలకు దగ్గరగా ఉన్నాయి. కనీసం పచ్చడి చేసుకుని తినాలి అన్నా టమోట, మిర్చి అవసరం అవుతాయి. అవికూడా వంద రూపాయల చేరవయ్యాయి. ఇక చికెన్ ధరలు కూడా ఈ కాలంలో రూ.300కు చేరవ అవుతోంది. ఇలాగుంటే సామాన్యులు ఏమి కొని తినగలం. ప్రభుత్వం ఈ ధరలను తగ్గించాలి.

ఆరీఫా సుల్తానా, గృహణి, అనంతపురం నగరం.

ధరలు నియంత్రించాలి

ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగాయి. దీనికితోడు కాయగూరల ధర పెరిగితే సామాన్యుడు ఏమి కొని తినగలడు. పెరిగిన కూరగాయల ధరలతో సామన్య, మధ్య తరగతి ప్రజలు కనీసం చారు కూడా చేసుకుని తినలేని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రభుత్వం ఈ ధరల నియంత్రణపై దృష్టి సారించాలి. రైతు బజారుల్లో అందుబాటు ధరల్లో వీటిని ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలి.

సావిత్రి, ఐద్వా రాష్ట్ర నాయకులు.

ఉద్యమ స్ఫూర్తితో రక్తదానం

ప్రతి ఏడాది రక్తదాన శిబిరం నిర్వహిస్తాం - సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు



రక్తదానం చేస్తున్న వారితో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సామాజిక సేవలో భాగంగా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తెలిపారు. మంగళవారం నాడు సిఐటియు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సిఐటియు ఉద్యమ నిర్మాత పర్సా సత్యనారాయణ శత జయంతి సందర్భంగా సిఐటియు అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మానవతా రక్తదాతల పెద్దలు తరిమెల అమర్నాథ్ రెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఓబులు హాజరై ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మానవతా రక్తదాతల సంఘం తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం నిరంతర కషి చేస్తున్న సిఐటియు సామాజిక, సేవా కార్యక్రమాల్లో కూడా ముందు భాగాన నిలుస్తోందన్నారు. కార్పొరేట్ వైద్యం వచ్చిన తర్వాత ప్రయివేట్ బ్లడ్ బ్యాంకుల్లో ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని రక్తం కోసం వేల రూపాయలు లాగేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ ప్రమాదం బారిన పడ్డవారు రక్తం లేక ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. సాటి మానవులుగా రక్తం ఇచ్చి వారి ప్రాణాలు కాపాడుదామన్నారు. రక్తం ఇస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయనే అనుమానాలు సరికావన్నారు. రక్తదానం చేస్తే ఆరోగ్యానికి మంచిదన్న విషయం తెలుసు కోవాలన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం రక్తదానం శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. డాక్టర్ వీరభద్రయ్య మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా అలవాటు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ పవన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఏజి.రాజమోహన్, సిటిజన్ ఫోరం కార్యదర్శి శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, సురేంద్ర, సిఐటియు నాయకులు శ్రీనివాసులు, నాగభూషణం, ప్రకాష్‌రెడ్డి, ఆదినారాయణ, మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్, శ్రీరంగ, మంజునాథ్, మున్సిపల్ యూనియన్ నాయకులు తిరుమలేష్, ఎర్రిస్వామి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లింగమయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించేంత వరకు పోరాటం

- ప్రజలు మేలుకోకపోతే పదేళ్ల పాటు విద్యుత్ భారాలు తప్పవు
- 30న విద్యుత్ కార్యాలయాల ఎదుట ఆందోళలు
- ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

"కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎడాపెడా విద్యుత్ ఛార్జీలను పెంచుతోంది. అన్ని వర్గాల ప్రజలపై ఈ భారాలు పడుతున్నాయి. వివిధ రూపాల్లో ప్రభుత్వాలు జనంపై బాదుడు భారాన్ని మోపుతున్నారు. ఈ చర్యలను ప్రజలందరూ ప్రతిఘటించాలి. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించేంత వరకు పోరాటం సాగించాలి. లేకుంటే వచ్చే పదేళ్ల పాటు జనంపై విద్యుత్ భారాలు తప్పవు." అని వామపక్ష పార్టీల నేతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం నాడు అనంతపురం ఏపీ ఎన్జీవో హోంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఎన్.శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, ఎస్‌యుసిఐ నాయకులు తబ్రేజ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పక్షపాతి ప్రభుత్వమంటూనే మెత్తగా భారాలు మోపుతోందన్నారు. ఎప్పుడో 20 పైసలు, 30 పైసలు చెల్లించలేదనే సాకులు చెబుతూ ఇప్పుడు మొత్తం కలిపి జనం నుంచి వసూలు చేసేలా విద్యుత్ ఛార్జీలు అమాంతం పెంచారన్నారు. 2013లో వినియోగించిన విద్యుత్‌కు ఇప్పుడు ఛార్జీలు చెల్లించాలనడం దుర్మార్గంగా ఉందన్నారు. వంద రూపాయలు బిల్లు వచ్చే సగటు వినియోగదారులకు ఈ నెల రూ.300కు పెంచి వసూలు చేశారన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుకూల కార్పొరేట్ దిగ్గజం అదానీ కంపెనీకి విద్యుత్ ఉత్పత్తి బాధ్యత అప్పగించి కోట్లాది రూపాయలు ప్రజలపై భారాలు మోపి దోపిడీ చేయిస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం టిడిపి కూడా తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని చెబుతున్నారని, దీనిపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపుదలపై బాదుడే బాదుడు అంటూ ప్రజల వద్దకు వచ్చి ముద్దాడి ఓట్లు అడిగారన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అధిక భారాలు మోపి పిడిగుద్దులు గుద్దుతున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపు పేరుతో రూ.12,500 కోట్లు భారాలు మోపడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం అయ్యిందన్నారు. అదానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు విద్యుత్ ఉత్పత్తి చేయించి వారి నుంచి అదనపు ధరలతో విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారాలను ప్రజలపై మోపుతున్నారని తెలిపారు. సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం చెప్పిందే జగన్ ప్రభుత్వం అమలు చేస్తూ ప్రజలపై భారాలు మోపుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధిక కరెంటు బిల్లులను చూపి సంక్షేమ పథకాల్లో కోతలు పెట్టేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఎస్‌యుసిఐ నాయకులు తబ్రేజ్ మాట్లాడుతూ ఇప్పటికే తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం దుర్మార్గమైన చర్యన్నారు. సిటిజన్ ఫోరం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్‌ఛార్జీల పెంపుదలపై ఫోరం ఆధ్వర్యంలో పోరాటాలు, న్యాయస్థానం ఫిర్యాదు చేయడం వల్ల జిల్లాలో సర్‌ఛార్జీల వసూళ్ల ఆపారని గుర్తు చేశారు. సమావేశం అనంతరం ఈ నెల 30న జిల్లా నియోజకవర్గం, మండల కేంద్రాల్లోని విద్యుత్ కార్యాలయాల వద్ద చేపట్టే నిరసనల్లో ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మన్నీల సర్పంచి త్రిలోక్‌నాథ్, సిపిఎం నాయకులు ముస్కిన్, ప్రకాష్, ఇర్ఫాన్, మసూద్, సిటిజన్ ఫోరం నాయకులు ఎజి.రాజమోహన్, సిపిఐ నాయకులు అల్లీపీరా, బంగారు బాషా, రమణయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ప్రతి గడపకూ వెళ్లి అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేయాలని మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నగరంలోని 12వ డివిజన్ పరిధిలో ఉన్న 17, 19 సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ కులాలు,మతాలు, పార్టీలు చూడకుండా అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇంకా ఎవరికన్నా సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందకుంటే జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు బాబా ఫక్రుద్దీన్, అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఆర్ఐ మురళి, తదితరులు పాల్గొన్నారు.

'తెలుగుతమ్ముళ్ల' బాహాబాహి

కుందుర్పి బస్సుయాత్రలో రచ్చ - ఉన్నం, మాదినేని గ్రూపులుగా విడిపోయిన నేతలు



బస్సుయాత్రలో ఉన్నం, మాదినేనికి మద్దతుగా నినాదాలు చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి-కుందుర్పి

కళ్యాణదుర్గం టిడిపిలో మరోసారి వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు మద్దతుదారులు ఒకరిపై ఒకరు భౌతిక దాడులకు పాల్పడ్డారు. కుందుర్పి మండల పరిధిలోని శీగలపల్లి గ్రామంలో భవిష్యత్తు గ్యారెంటీ బస్సుయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, కళ్యాణదుర్గం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతుండగానే ద్వితీయ శ్రేణి నాయకులు ఉన్నం, ఉమామహేశ్వర నాయుడుకు మద్దతుగా నినాదాలు చేశారు. ఇది కాస్త శృతిమించి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాదాపు బస్సుయాత్ర సాగిన అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉండడంతో నాయకులు యాత్రను నామమాత్రంగా నిర్వహించి ముగించేశారు.

చంద్రన్న పాలనతోనే రాష్ట్రాభివృద్ధి

బస్సుయాత్రలో భాగంగా టిడిపి నాయకులు వైసిపి పాలనపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అధికారంలోకి రావాలని కోరారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి శూన్యంగా ఉందన్నారు. 2024లో సైకో పాలన వెళ్లి, సైకిల్ పాలన వచ్చేలా టిడిపి శ్రేణులు పని చేయాలని సూచించారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు - మంత్రికి విన్నవించిన నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్రంలోని అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు విమర్శించారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని మంత్రి ఉషాశ్రీచరణ్ నివాసంలో కలిసి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు ఎన్నో ఏళ్లుగా అనేక సమస్యలు ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తున్నారన్నారు. సిఎం జగన్ అంగన్‌వాడీలకు అనేక హామీ ఇచ్చారన్నారు. ముఖ్యంగా రూ.వెయ్యి వేతనం పెంపుతోపాటు గ్రాట్యుటీ కూడా ఇస్తామని స్వయానా అసెంబ్లీలోనే ప్రకటించారన్నారు. ఆ హామీ నేటికీ అమలు కావడం లేదన్నారు. ఈ విషయమై మంత్రి ఉషాశ్రీచరణ్‌ను అడగ్గా వాటిపై ఏవైనా జీఓలు ఉంటే తమకు అందజేయాలన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి చెప్పిన మాటలు, జీఓలు తెలియకుండా జిల్లా మంత్రి అంగన్‌వాడీల స్థితిగతులు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు కాపీలను త్వరలో మంత్రికి పంపుతామన్నారు. వెంటనే అంగన్వాడీలకు లభించే సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ పోస్టుల భర్తీలో అవకతవకలు

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీదాంట్లోను వ్యక్తిగత లాభం, స్వార్థం, కోసం అనుకున్నది సాధించడానికి ఎవరి కాళ్లయినా పట్టుకునే నైజం కలిగిన వ్యక్తి గరికిపాటి నరసింహారావు అన్నారు. ధార్మిక ప్రసంగాలంటూ, భారత, రామాయణాలు అంటూ ఘనమైన కీర్తులు పెట్టి మాట్లాడే ప్రవచనకర్త గరికిపాటి గారి విలువలు మితిమీరిపోతున్నాయని విమర్శించారు. వచ్చిన పద్మశ్రీతో తనకు వచ్చిన పలుకుబడిని ఉపయోగించి ఇటీవల అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ తెలుగు సహాయ ఆచార్యుల పోస్టులకు జరిగిన ఇంటర్వ్యూలో ఎన్నో అవకతవకలు చేసి తన కుమారుడు గురజాడను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేయడానికి సర్టిఫికెట్లు ఉద్దేపోరాడుతున్నారని విమర్శించారు. ఈ గరికిపాటి గురజాడ అనే వ్యక్తి ఈనెల 8న జరిగిన ఇంటర్వ్యూకు హాజరైన వారందరిలో అతి పిన్నవయస్కుడు అన్నారు. అర్హతలు లేనివాడన్నారు. కేవలం ఆన్‌లైన్‌లో గంటల వారీగా, సెమిస్టర్ వారీగా సిలికానాంధ్ర యూనివర్సిటీలో క్లాసులు చెప్పిన గరికిపాటి గురజాడకు తనపరపతిని ఉపయోగించి పూర్తిస్థాయి ఉద్యోగిగా సర్వీసు సర్టిఫికెట్టును సష్టించి, షార్ట్ లిస్టు అయ్యేలా చేసుకున్నాడని తెలిపారు. ఎంతోమంది సీనియర్లు, ఎప్పుడో పీ హెచ్‌డి చేసినవారు, విశ్వవిద్యాలయాల్లో, డిగ్రీ కాలేజీల్లో పని చేస్తున్నవారు, ఎన్నో పుస్తకాలు రాసి, సంపాదకులుగా వ్యవహరించి, వందలాది రీసెర్చ్ పేపర్లు ఉన్నవారిని కాదని, ఎలాంటి అనుభవం లేని తమ కుమారున్ని అందలం ఎక్కించడానికి ప్రయత్నం చేస్తున్నాడని తెలిపారు. గరికిపాటికి అంతరాత్మ అంటూ ఉంటే మీ అబ్బాయికి ఉద్యోగ ప్రయత్నాలను ఇంతటితో ఆపేసి, ప్రవచనాలకు సన్యాసం చేయాలని గరికిపాటిని విజ్ఞప్తి చేశారు. గరికిపాటి గురజాడ అనుభవం కోసం పెట్టిన సర్టిఫికెట్లు అమెరికాలోని సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం నుంచి తెచ్చాడన్నారు. నిజానికి సిలికానాంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అధ్యాపకులందరూ అతిథి అధ్యాపకులే అన్నారు. విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘం నిబంధనల ప్రకారం అతిథి అధ్యాపకుల సర్వీసును పరిగణనలోకి తీసుకోరని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచారించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధార్థ, నాయకులు విజయ్, రాజేష్, శివ, అశోక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

శానిటరీ కార్యదర్శులపై వేధింపులు ఆపాలి : సిఐటియు

గుంతకల్లు : చెత్త పన్ను వసూలు చేయాలని ప్రజలతోపాటు సచివాలయం శానిటరీ కార్యదర్శులను వేధించడం సరైంది కాదని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సాకే నాగరాజు, కసాపురం రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక హంపిరెడ్డి భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖ కార్పొరేషన్లలో చెత్త సేకరణ కోసం ప్రజల నుంచి శానిటరీ కార్యదర్శులు పన్నులు వసూలు చేయకపోతే సస్పెండ్ చేయడం దారుణమన్నారు. సస్పెండ్ చేసిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవడంతోపాటు కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాటే చెత్త పన్నును రద్దు చేసి ప్రజలపై భారాన్ని తగ్గించాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు తిమ్మప్ప, మోహన్, సీనా, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అనంత మార్కెట్ యార్డు ముందంజ

ఛైర్మన్ ఎకెఎస్.ఫయాజ్



మాట్లాడుతున్న మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎకెఎస్.ఫయాజ్

అనంతపురం : ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో స్థానిక మార్కెట్ యార్డు అభివృద్ధిలో ముందంజలో ఉందని ఛైర్మన్ ఎకెఎస్.ఫయాజ్ తెలిపారు. గుత్తి రోడ్డులో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులో ఛైర్మన్ ఫయాజ్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా అజెండాలోని అన్ని అంశాలకూ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వం అన్నారు. వారికి మేలు చేసేందుకు వైసిపి ఎప్పుడూ ముందుంటుందన్నారు. కాగా దేశంలోనే చీనీ పంట అధికంగా ఎగుమతి అవుతోన్న మార్కెట్ అనంత మార్కెట్ యార్డు అన్నారు. అలాగే యార్డులో రైతులకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ కంతులు, విశ్రాంత గృహం వంటివి ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ ఓబిరెడ్డి, కార్యదర్శి జయలక్ష్మి, డైరెక్టర్లు నీరజ, లలిత, పద్మావతి, శోభారాణి, రాజీ, రవికుమార్, సత్రశాల మంజునాథ్, దాసరి గోవిందు, నాగరాజు నాయక్, సాధుశేఖర్, రమేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

అధిక ధరకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

పెద్దవడుగూరు : మండల వ్యాప్తంగా అధిక ధరకు పత్తి విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని విజిలెన్స్ సీఐ వెంకటరమణ, వ్యవసాయశాఖ గుత్తి ఎడిఎ వెంకటరాముడు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఆర్‌బికె కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పలు ఎరువుల దుకణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అవసరాలను ఆసరగా చేసుకుని పత్తి, ఇతర విత్తనాలను అధిక ధరకు విక్రయించరాదన్నారు. విక్రయిస్తే డీలర్ల లైసెన్సులు, అనుమతులను రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే దుకాణంలో కొన్న ప్రతి వస్తువుకూ బిల్లు ఇవ్వాలన్నారు. కంపెనీలు సరఫరా చేసి సర్టిపై చేసిన వాటినే విక్రయించాలన్నారు. అనంతరం డీలర్ల లైసెన్సులు తదితర వాటిపై ఆరాతీశారు. ఈ సమావేశంలో విజిలెన్స్ వ్యవసాయాధికారి వాసుప్రకాష్, రేంజర్ యామినీప్రసన్న, ఎంపిడిఒ కుళాయిస్వామి, ఎస్ఐ శ్రీనివాసులు, పెద్దవడుగూరు యాడికి, పామిడి మండల వ్యవసాయాధికారులు మల్లీశ్వరి, మహమ్మద్ షా, లీనా వసుంధర, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం నుంచి విటి.రామాంజనేయులు తొలగింపు

సిపిఎం జిల్లా నాయకులు ఓ.నల్లప్ప, బాలరంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

సిపిఎం నుంచి విటి రామాంజనేయులును తొలగించినట్లు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుడి వద్ద మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎంలో పని చేసిన వీటి రామాంజనేయులు పార్టీ క్రమశిక్షణా పద్ధతులకు విరుద్ధంగా పని చేశారన్నారు. ఇతనిపై వచ్చిన ఆరోపణలు జిల్లా కమిటీ విచారణలో వాస్తవమని తేలడంతో పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో సిపిఎం నిర్వహించబోయే కార్యక్రమాలకూ, రామాంజనేయులకూ ఎలాంటి సంబంధం లేదన్నారు. అనంతరం సిపిఎం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎస్.సూరి, మండల కమిటీ సహాయ కార్యదర్శిగా వెంకటచౌదరి, మండల కమిటీ సభ్యులుగా పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, రేణుకను ఎన్నుకున్నారు.

పట్టణాభివృద్ధిలో వెనుకడుగు వేయం..: ఎమ్మెల్యే



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణాభివద్ధిలో వెనకడుగు వేసేదేలేదని, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజలు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కోరారు. పట్టణంలోని ధర్మవరం రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు వద్ద రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న ధర్మవరం రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు సమస్య పరిష్కారం కోసం తాను రైల్వే మంత్రులు, రైల్వే బోర్డు ఉన్నతాధికారులతో ఏడాదిన్నర కాలంగా సంప్రదింపులు చేశానన్నారు. దీంతో స్పందించిన బోర్డు అధికారులు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం అంగీకారం తెలిపారన్నారు. బ్రిడ్జి నిర్మాణంలో నష్టం వాటిల్లిన ప్రజలకు నష్ట పరిహారం అందిస్తామన్నారు. బ్రిడ్జి నిర్మాణం అనంతరం 60 అడుగుల రోడ్డుగా మారడంతో గేటు అవతలున్న వార్డుల ప్రజలకు ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రజల సౌకర్యార్థం చేస్తున్న పనులకు అందరూ సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణలో ప్రజలు తమ సమస్యలను రెవెన్యూ,మున్సిపల్ అధికారులకు అర్జీల రూపంలో విన్నవిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సభలో ఆర్డీఓ రవీంద్ర, మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని, కమిషనర్ మల్లికార్జున, డీఎస్పీ నరసింగప్ప, తహశీల్దార్ బి.రాము, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ మైమున్, రైల్వే ఇంజినీరింగ్ సెక్షన్ అధికారి రెడ్యానాయక్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల ఆగడాలను అరికట్టాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయుకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం ప్రాంతంలో ప్రయివేటు పాఠశాలల ఆగడాలను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరుతో దోపిడికీ పాల్పడుతున్నాయన్నారు. ముఖ్యంగా అడ్మిషన్‌కు ముందు ఒక ఫీజు, తర్వాత మరో ఫీజు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో విద్యార్థుల తల్లితండ్రులకు ఆర్థిక భారంగా మారిందన్నారు. అంతేగాకుండా రూ.వేలకు వేలు బస్సు ఫీజులు కట్టించుకుని ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతున్నారన్నారు. ఈ విషయాలన్నా స్థానిక విద్యాశాఖాధికారులకు తెలిసినా మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే విద్యాశాఖాధికారులు స్పందించి కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, ధనుష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్ర కాదు..తుస్సు యాత్ర..

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

తెలుగుదేశం పార్టీ చేస్తోంది బస్సు యాత్ర కాదని, తుస్సుయాత్ర అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం అనంతపురంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 'మైనింగ్ దొంగలు మీరే.. ఉపాధి హామీ దొంగలు మీరే, నీరు–చెట్టు దొంగలు మీరే.. ప్రాజెక్టుల దొంగలు మీరే.. రియల్ ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ భూములను ఆక్రమించింది మీరే.. దోపిడీకి బ్రాండ్ అంబాసిడర్ మహానటి పరిటాల సునీత, పరిటాల కుటుంబం అని నిప్పులు చెరిగారు. తాము అధికారంలోకి వచ్చాక ఎక్కడా ఆశ పడకుండా, స్వార్థం లేకుండా, గొప్పగా బతకాలనే ఆలోచించకుండా, నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. తాము ఈరోజూ అద్దె ఇంట్లో ఉంటున్నామంటే ఎలా జీవిస్తున్నామో అర్థం చేసుకోవాలన్నారు. తాము చేసిన పనులను ప్రజలను అడిగి తెలుసుకునేందుకే తిరిగి జగనన్న సురక్ష పేరుతో జనాల వద్దకు వెళ్తున్నామన్నారు. పరిటాల సునీత చేపట్టిన బస్సుయాత్ర పేరూరుకు వెళ్లిన సందర్భంలో వీధిలైట్లు వెలగడం లేదు.. మేము వీధిలైట్లు వేయిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు, పరిటాల కుటుంబం వాస్తవాలు మాట్లాడాలని లేనిపక్షంలో ప్రజలు మరోసారి మరింత ఘోరంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాప్తాడు వైస్ ఎంపిపి రామాంజనేయులు, రాప్తాడు వైసిపి మండల కన్వీనర్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి : ఎడిఎ రవి



రికార్డులు పరిశీలిస్తున్న ఎడిఎ మీనల రవి

ప్రజాశక్తి-అనంతపురం

పురుగు మందుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలకు లోబడే విక్రయాలు సాగించాలని అనంతపురం వ్యవసాయ శాఖ డివిజన్ ఎడిఎ మీనల రవి సూచించారు. మంగళవారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న భవానీ ఏజెన్సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గోదాములోని నిల్వలు పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా రికార్డులు ఉంచాలన్నారు. అదేవిధంగా రైతులకు అమ్మే ప్రతి వస్తువునూ ఎంఆర్‌పి ధరలకే అమ్మాలన్నారు. అనంతరం అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ఎ.నారాయణపురం ఆర్‌బికెను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా అక్కడ రైతులకు అందిస్తున్న సేవలు, పిఎం కిసాన్, కీయాష్కీ, మిషన్ ద్వారా ఎరువులు, విత్తనాలు అమ్మకాల వివరాలు, భూసార పరీక్ష నమూనాల సేకరణ, కౌలు రైతు కార్డుల పంపిణీపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రసాద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పట్టవా..?

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు



మాట్లాడుతున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేసేంత వరకూ పోరాటాలు ఉధృతం చేస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు హెచ్చరించారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ కర్తవ్యాల అమలులో భాగంగా మంగళవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో కార్మికులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అలాటే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని, 101 పద్దు కింద అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలను చెల్లించాలని, రాయదుర్గం పట్టణ జనాభా అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, రెగ్యులర్ కార్మికులకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి జిపిఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర కమిటీ ఆమోదించిన కర్తవ్యాలను రాయదుర్గం మున్సిపాలిటీలో కూడా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు ఆదినారాయణ, స్థానిక యూనియన్ నాయకులు రాము, మల్లేష్, తిప్పేస్వామి, వన్నూరుస్వామి, ఎర్రిస్వామి, సిద్ధ, ఆదిలక్ష్మి సాహీరాబి, వెంకటేశులు, కార్మికులు పాల్గొన్నారు.

పనుల పూర్తిపై ప్రత్యేక దృష్టి

ప్రత్యేకాధికారి మహమ్మద్ రఫీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మహమ్మద్ రఫీ

ప్రజాశక్తి-నార్పల

గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి మహమ్మద్ రఫీ ఆదేశించారు. మంగళవారం మండలంలోని చామలూరు, నడిమిదొడ్డి గ్రామాల్లో చేపట్టిన నాడు నేడు పనులు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పనులను త్వరితగతిని పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమపై ఆరాతీశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తర్వాత మండల స్థాయి అధికారులతో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్‌కుమార్, ఎంపిడిఒ దివాకర్, మండల విద్యాధికారి ఎం.కృష్ణయ్య, ఇఒఆర్‌డి జి.లక్ష్మీనరసింహా, వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ వై.మహేంద్రనాథ్, సిహెచ్ఒ జి.బాలాజీరావు, వెలుగు ఎపిఎం తిప్పమ్మ, వ్యవసాయ శాఖ అధికారిణి శైలజ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'

కలెక్టర్ ఎం.గౌతమి



మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-ఆత్మకూరు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని సనప గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్షను ఆకస్మింగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో జగనన్న సురక్ష అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరైనా అర్హులై ఉండి పథకాలు అందకుంటే అలాంటి వారిని గుర్తించాలన్నారు. ఖచ్చితంగా ప్రతి ఇంటినీ సర్వే చేయాలన్నారు. ఒకవేళ ఇంటికి తాళం వేసి ఉంటే రెండోసారి ఆ ఇంటికి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. పథకాలు లేదా డాక్యుమెంట్ సంబంధిత సమస్యలు ఉన్న వ్యక్తులందరినీ క్యాంపుకు రావడానికి ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు తమకు కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని, ఏడాదికాలంగా తన ఇంటి నిర్మాణానికి సంబంధించి ఉపాధి హామీ, హౌసింగ్ బిల్లులు అందలేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన కలెక్టర్ డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, హౌసింగ్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ మధుసూదన్, మండల ప్రత్యేక అధికారి రఘునాథ్‌రెడ్డి తహశీల్దార్ షర్మిల, ఎంపిడిఒ విజయప్రసాద్, పంచాయతీ సెక్రటరీ కీర్తన, సర్పంచి నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

300 క్వింటాళ్ల వేరుశనగ కేటాయింపు

పుట్లూరు : మండలానికి 300 క్వింటాళ్ల కె–6 రకం వేరుశెనగ కేటాయించినట్లు ఎఒ కాత్యాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా ఇప్పటి వరకు 201 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా అర్హులైన రైతులందరూ పిఎం కిసాన్ కోసం ఇకెవైసి చేయించుకోవాలని కోరారు. ఇకెవైసి చేయించుకోని రైతులు వెంటనే తమ పరిధిలోని ఆర్‌బికెల్లోగానీ, మీసేవా కేంద్రాల్లోగానీ ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

గొర్రెల దొంగలు అరెస్టు

పెద్దవడుగూరు : గొర్రెల దొంగలను అరెసుట చేసినట్లు సిఐ శంకర్‌రెడ్డి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దవడుగూరులోని అక్షయ కాలనీ సమీపంలో ఉన్న చాకలి రాజుకు చెందిన గొర్రెల మంద నుంచి 10 గొర్రెలను దొంగతనానికి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా పెద్దవడుగూరుకు చెందిన కాయల రామాంజనేయులు, గుత్తివెంకటాంపల్లికి చెందిన దూదేకుల నాగరాజు, మరో బాలుడు కలిసి వీటిని దొంగలించినట్లు గుర్తించి మంగళవారం వెంకటాంపల్లి సమీపంలో అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితుల నుంచి రూ.1.2లక్షల విలువజేసే పది గొర్రెలతోపాటు దొంగతనానికి ఉపయోగించిన ద్విచక్రవాహన్ని స్వాధీతనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమేదార్లు నాగేశ్వరరావు, గౌస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి, టిడిపి నాయకుల మధ్య ఘర్షణ

తాడిపత్రి రూరల్ : జగనన్న కాలనీ విషయమై వైసిపి టిడిపి నాయకులు పరస్పరం దాడులు చేసుకున్న ఘటన మండల పరిధిలోని గంగాదేవి పల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా గంగాదేవిపల్లిలో జగనన్న కాలనీ కోసం స్థలం చదును చేస్తున్నారు. ఈ విషయంలో ఇరువర్గాల ఘర్షణకు దారితీసి టిడిపి, వైసిపి వర్గాలు రాళ్లతో దాడి చేసుకున్నాయి. ఈ ఘర్షణలో నలుగురు వైసీపీ నాయకులు ఇద్దరు టిడిపి నాయకులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు క్షేత్రస్థాయికి వెళ్లి ఇరువర్గాలను చెదరగొట్టి గాయాలపాలైన వారిని ప్రథమ చికిత్స కోసం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డీఎస్పీ గంగయ్య పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని గాయపడిన వారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు.

ద్విచక్రవాహనం బోల్తా.. పోలీసులకు గాయాలు

పెద్దవడుగూరు : ద్విచక్ర వాహనం బోల్తా పడటంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు పోలీసులు మంగళవారం గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఎఎస్ఐ నారాయణనాయక్, జమేదారు మనోహర్ విధుల నిమిత్తం ద్విచక్రవాహనంలో వస్తుండగా పందులవాగు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వీరిని చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

చిరుత దాడిలో మేకలు మృతి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం ఎర్రిస్వామికి చెందిన రెండు మేకలను చిరుత దాడి చేసి చంపింది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సోమవారం సాయంత్రం కొండపై నుండి మేకల మందతో దిగి వస్తుండగా రెండు మేకలను చిరుత తీసుకెళ్లినట్లు ఆలస్యంగా గుర్తించామన్నారు. రాత్రి సమయంలో వెతికిన మేకల జాడ దొరకలేదు. దీంతో మంగళవారం ఉదయం కుక్కలను తీసుకెళ్లి గాలించగా కొండల మధ్య రెండు మేకలను చంపిన ఆనవాళ్లు లభించాయన్నాడు. వీటి విలువ సుమారు రూ.30వేల దాకా ఉంటుందన్నారు. విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు వచ్చి మేకల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించారు. కాగా గత 15 రోజుల క్రితం కూడా రెండు మేకలు చిరుత దాడిలో చనిపోయిన విషయాన్ని గుర్తు చేశాడు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుత బారీ నుంచి కాపాడాలని బాధితుడు కోరాడు.



చిరుత దాడిలో మృతిచెంది మేకలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న అధికారులు

అర్హులందరూ లబ్ధి పొందాలన్నదే లక్ష్యం



అధికారులతో మాట్లాతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రాయదుర్గంలో అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన

రాయదుర్గం : అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మంగళవారం రాయదుర్గం పురపాలక సంఘంలో పర్యటించారు. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష కార్యక్రమం పురపాలక సంఘం పరిధిలో ఏ విధంగా అమలవుతుందో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘ అధ్యక్షులు పోరాళు శిల్ప, కళ్యాణదుర్గం ఆర్‌డిఒ నిశాంత్‌రెడ్డి, రాయదుర్గం తహశీల్దార్ మారుతి, కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.

సెల్ఫీల మోజులో 'కాలవ' : వైసిపి

రాయదుర్గం : మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు సెల్ఫీల మోజులో పడి ఎక్కడ అభివృద్ధి జరిగిందో తెలుసుకోలేకపోతున్నాడని డి.హీరేహాళ్ వైసిపి మండల కన్వీనర్ హొన్నూరుస్వామి, నేమకల్లు సర్పంచి పరమేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. గత సోమవారం సెల్ఫీ పిచ్చితో హిర్దేహల్ క్రాస్ నుంచి నేమకల్ వరకూ రూ.20కోట్లతో తాను రోడ్డు వేయించినట్టు సెల్ఫీ తీసుకోవడం బాధాకరమన్నారు. తాను వేయించిన రోడ్డును క్రషర్, ఐరన్ ఫ్యాక్టరీ లారీల ద్వారా ధ్వంసం చేస్తున్నారని ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడన్నారు. కావల శ్రీనివాసులు ఇప్పటికైనా ఇలాంటి రాజకీయాలు మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

రజకులకు విరాళం

తాడిపత్రి : పట్టణంలోని శివాలయం వెనక పెన్నానది ఒడ్డున ఉన్న దోబీఘాట్ మరమ్మతుల కోసం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో తాడిపత్రి రజక అభివృద్ధి సంఘం నాయకులకు ఇందుకు సంబంధించిన విరాళాన్ని అందజేశారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

నార్పల : ముస్లిం సోదరులు బక్రీదు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలలోని ముస్లిం మతపెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గురువారం నిర్వహించనున బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రార్థన ఎన్ని గంటలకు ప్రారంభమవుతుంది.. ఎన్ని గంటలకు ముగుస్తుంది అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ముతవల్లి శంషాద్దీన్, జామియా మసీదు, ఈద్గా, మసీదు, మక్కా మసీదు ఇమామ్‌లు జక్రియా, ఫయాజ్, మన్సూర్, మౌజాన్లు ఫక్రుద్దీన్, మస్తాన్, ఎఎస్ఐలు ఈశ్వరయ్య, నాగరాజు, పోలీస్ సిబ్బంది పలువురు ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలందరికీ రక్ష అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం రుద్రంపేట పంచాయతీ పరిధిలోని సచివాలయం-1లో 'జగనన్న సురక్ష'పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎదురైన సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. ఇంకా ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారం కోసం 'జగనన్న సురక్ష' చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే సిఎం జగన్ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా నెల రోజులపాటు జనన, మరణ, వివాహ, కుల, ఆదాయం వంటి వివిధ రకాలైన 11 సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, సర్పంచి సుగాలి పద్మావతి, వైస్ ఎంపిపి బాలాజీ, ఎంపిటిసిలు ఓంప్రకాష్‌రెడ్డి, నారాయణమ్మ, మహబూబ్‌బీ, వైసిపి నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, నవీన్, సాదిక్, తిరుపతినాయుడు, వెంకటేష్ నాయక్, బెస్త నాగరాజు, పురుషోత్తం, విజయ్ కుమార్, పద్మావతి, రామమూర్తి, రాజు నాయక్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పొందాలన్నదే సిఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని 27వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలకు ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలు, అభివృద్ధిని వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్నా ధృవపత్రాలు లేవన్న కారణంతో లబ్ధి పొందలేని ప్రజలకు

'జగనన్న సురక్ష'లో నాయకులు

సాంత్వన కల్పించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 11 రకాలు ధ్రువ పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. వాలంటీర్లు ప్రతి గడపకూ వెళ్లి పొరపాటున ఎక్కడైనా, ఎవరికైనా పథకాలు అందకుండా మిగిలిపోయి ఉంటే అర్హులకు మంచి చేయనున్నట్లు తెలిపారు. కాగా స్థానిక వైసిపి కార్యాలయంలో పెద్దవడుగూరు మండలం బూర్ణకుంట గ్రామానికి చెందిన పలువురు వైసిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉరవకొండ : టిడిపి అధినేత చంద్రబాబు రాజకీయ జీవితమంతా ప్రజలను మోసగించడం, దగా చేయడంతోనే సాగిందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. మంగళవారం వజ్రకరూరు మండలం గంజికుంట గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో పాలనంతా తూతూమంత్రంగా సాగిందన్నారు. అదే జగన్ అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వీటి చూసి ఓర్చుకోలేని ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిపి రామవత్ దేవి, వైస్ ఎంపీపీలు సుశీలారాణి, ముండ్ల సుంకమ్మ, ఎంపిటిసి రామకృష్ణ, వైసిపి నేతలు ప్రసాద్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాచన్నగౌడ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, తేజేశ్వర్‌రెడ్డి, ఉస్మాన్, వైద్యనాథ్‌రెడ్డి, అమర్నాథ్, వీరభద్రగౌడ్, చిదంబరి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ



అనంతపురంలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత

పథకం ద్వారా లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తపేట పంచాయతీలో ఉన్న పాత కొత్తపేట, మామిళ్లచెరువు గ్రామాల్లో సర్పంచి ఆర్.గురు మస్తాన్, నాయకులు ఎస్.తిరుపాలమ్మ, ఎస్.రాము యాదవ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల పథకాల గురించి లబ్ధిదారులకు వివరించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డి, ఎంపిపి జి.విశాలాక్షి, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సునీలా యాదవ్, వైసిపి సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి, బేడల వెంకటరాముడు, బి.రమేష్‌రెడ్డి, ఎం.రంగస్వామి, బి.సురేష్‌యాదవ్, అబ్దుల్‌వహాబ్, సుధాకర్‌యాదవ్, రవి, నాగిరెడ్డి, కౌన్సిలర్లు ఫారూఖ్, వరద, వాల్మీకి శివ, నరేష్, సర్పంచి చిన్న ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ శంకరయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రామసాగంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఓబులేసు, ఎంపిడిఒ రామచంద్ర, ఎంఇఒ మల్లారెడ్డి, శివారెడ్డి, సర్పంచు రామలక్ష్మమ్మ, ఎంపిటిసి వీరబొమ్మన్న, వాలంటరీలు, తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రి, గుత్తిలో మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యేలు పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి-నార్పల


ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే ఉచిత విద్యను సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పలువురు ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఏడాది నార్పల ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదివే 14 మంది విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో రెసిడెన్షియల్ సీట్లు సాధించారన్నారు. ప్రయివేటు పాఠశాలల్లో ఒక్కొక్క రెసిడెన్షియల్ సీటు సాధించడానికి విద్యార్థులకు కోచింగ్ ఇచ్చారన్నారు. ప్రస్తుతం విద్య ఒక వ్యాపారంగా మారిపోయిందన్నారు. ప్రతి విద్యార్థి ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రెండు జతల దుస్తులు, పుస్తకాలు, బూట్లు అందివ్వడంతోపాటు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తోందన్నారు. అంతేగాకుండా మీరు డబ్బు కట్టకపోయినా విద్యార్థి చదవకపోతే ప్రశ్నించే హక్కు ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయనీయులు మంజుల, మహబూబ్‌బాషా, రవికుమార్, సరోజ, కృష్ణవేణి, రాజేష్, హేమలత, అటెండర్ పార్వతమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సేవ చేయడం ఆనందం

గుత్తి : విద్యారంగంలో సేవ చేయడం ఆనందదాయకమని మండల విద్యాధికారులు బి.రవి నాయక్, మనోహర్ కొనియాడారు. 1998 క్వాలిఫైడ్ అయ్యి మండలంలోని వివిధ పాఠశాలల్లో ఇటీవల నూతనంగా విధులు చేపట్టిన ఉపాధ్యాయులు మంగళవారం స్థానిక పట్టణంలోని ఎంఇఒ కార్యాలయంలో మండల విద్యాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎఇఒను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పకీరప్ప, గిరిధర్, శర్మాస్, లాలు సాహెబ్, మురళి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

నార్పల : మండల పరిధిలోని దుర్గం ఎంపీపీ స్కూల్‌లో పని చేస్తున్న శ్రీనివాసులు, జగన్ బదిలీ కావడంతో సర్పంచి రామాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, జగన్ గత కొన్నేళ్లుగా గ్రామంలో పని చేస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారన్నారు. అలాంటి ఉపాధ్యాయులు బదిలీ కావడం బాధాకరమన్నారు. అయితే బదిలీ సర్వసాధారణమని, వారు ఎక్కడున్నా సంతోషంగా ఉండాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయులు నాగార్జునరెడ్డి, ఇందిరమ్మ, లక్ష్మీకుమారి, రమేష్‌రెడ్డి, వెంకటేశులు, వెంకటశివారెడ్డి, తల్లిదండ్రులు వడ్డీ నారాయణస్వామి, నాగేష్, కుళ్లాయప్ప, భాగ్యలక్ష్మి, స్కూలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం